క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని మైనార్టీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు కొత్త పథకాలను ప్రకటించిందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎంఏ భారతి శనివారం తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజనలో మైనార్టీవర్గాలకు చెందిన ముస్లింలు, సిక్కులు, బుద్ధులు, జైనులు పార్సీ మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు రూ.50వేల గ్రాంటును అందిస్తారని పేర్కొన్నారు. ఈ డబ్బుతో వ్యాపారం చేయాల్సి ఉంటుందని తెలిపారు. మిస్కిన్‌ల కోసం ×రేవంతన్నా కా సహారా× ద్వారా ఫకీర్, దూదేకుల, ముస్లిం కమ్యూనిటీ సభ్యులకు మోపెడ్లు, బైక్, ఈ–బైక్‌ల కోసం ఒక్కో యూనిట్‌కు రూ.లక్ష చొప్పున పంపిణీ చేయాలని ప్రతిపాదించారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు అక్టోబరు 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్స్

సిరిసిల్లకల్చరల్: ఆడపిల్లల ఉన్నత విద్యాభ్యాసం కోసం అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఏటా రూ.30వేలు అందజేస్తామని ప్రకటించింది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకున్న ఆడపిల్లలు మాత్రమే అర్హులు అని స్పష్టం చేసింది. ఈమేరకు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేసిన ఆడపిల్లలు తమ డిప్లొమా, డిగ్రీ చదువుల కోసం రెగ్యులర్ ప్రాతిపదికన ప్రవేశాలు తీసుకున్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సంతకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, పదోతరగతి మెమో, ఇంటర్ మెమో, అడ్మిషన్ ప్రూఫ్ (బోనఫైడ్ సర్టిఫికెట్), ట్యూషన్ ఫీజు రసీదులను పీడీఎఫ్ ఫార్మట్‌లో అప్‌లోడ్ చేస్తూ ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఐసీఈయూ నూతన కార్యవర్గం


దినకర్


శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: జీవిత బీమా సంస్థ సిరిసిల్ల శాఖ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ (ఐసీఈయూ) యూనియన్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా నాయిని దినకర్, ఉపాధ్యక్షుడిగా బజార్ శ్రీకాంత్, ప్రధానకార్యదర్శిగా రాపెల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు మల్లేశం, గంప ప్రణీత్, కోశాధికారిగా శివాని, ఈసీ మెంబర్స్ కిరణ్, సాయి చంద్ర ప్రకాశ్, కావ్య, భూమయ్య, జీసీఎం గాజుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

పోషకాహారంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఉమారాణి

గంభీరావుపేట: మండలకేంద్రంలోని అంగన్‌వాడీకేంద్రంలో శనివారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి తల్లిదండ్రులకు పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక, టీచర్లు ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని తాడూర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ కొండికొప్పుల పద్మ, సూపర్వైజర్ అరవింద ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మదర్ కమిటీ సభ్యులు సరళ, జ్యోత్స్న తేజ, భవాని, రవళి, లావణ్య, అఖిత, ధనంజలి, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ప్రయాణికుల రద్దీ నెలకొంది. బతుకమ్మ, దసరా సెలవులు రావడంతో బస్టాండ్‌లో ప్రయాణికులతో బస్టాండ్ కిక్కిరిసిపోయింది. బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బస్టాండ్‌లో రద్దీ నెలకొంది. బాలికల గురుకుల పాఠశాల, కేజీబీవీ, ప్రైవేటు పాఠశాలల హాస్టల్ విద్యార్థులను తీసుకెళ్లేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు.

మహిళను ఢీకొట్టిన బైక్

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ఏరియాలో శనివారం రాత్రి ఇద్దరు యువకులు బైక్‌పై వస్తూ ఓ మహిళను ఢీకొట్టారు. మహిళతో పాటు ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన వేణు మరో యువకుడితో కలిసి బైక్‌పై వస్తున్నారు. ఎల్లారెడ్డిపేట డబుల్ బెడ్‌రూమ్ కేసీఆర్ కాలనీలో నివసిస్తున్న కళావతి రోడ్డు దాటి డబుల్ బెడ్ రూమ్ వైపునకు వెళ్తుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో మహిళ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. క్షతగాత్రులను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.


సిరిసిల్ల: పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


వేములవాడ : న్యూఅర్బన్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో..


వేములవాడఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు

విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబరాలు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి విద్యార్థినులు ఒక్కచోట చేరి ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని పలువురు పేర్కొన్నారు. విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలియజేశారు. అనంతరం సమీప చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కోనరావుపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


గంభీరావుపేట: కిషన్‌దాస్‌పేట పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


చందుర్తి : సనుగులలో బతుకమ్మ వేడుకలు


బోయినపల్లి: బతుకమ్మలతో విద్యార్థినులు


ఇల్లంతకుంట గురుకుల పాఠశాలలో ..


సిరిసిల్ల అర్బన్ : పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో ..


వీర్నపల్లి: బతుకమ్మలతో విద్యార్థులు


సిరిసిల్ల టౌన్ : బతుకమ్మ సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు


ముస్తాబాద్‌లో బతుకమ్మలతో మహిళలు


తంగళ్లపల్లిలో..

ఘనంగా బొడ్డెమ్మ

వేములవాడ: రాజన్న క్షేత్రంలో శనివారం రాత్రి బొడ్డెమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొడ్డెమ్మలను ఆలయ ఆవరణలో పెట్టి బతుకమ్మ ఆటాపాటలతో సంబరాలు చేసుకున్నారు. అనంతరం ధర్మగుండంలో నిమజ్జనం చేశారు.





క్షయ రహిత సమాజం నిర్మిద్దాం

ముస్తాబాద్: క్షయవ్యాధి రహిత సమాజం నిర్మించాలని వైద్యాధికారి గీతాంజలి అన్నారు. మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నిర్మూలనకు చేపట్టాల్సిన పనులపై టీబీ చాంపియన్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. టీబీ వ్యాధికి గురై కోలుకున్న వారు టీబీ చాంపియన్లుగా పిలుస్తారని, తమ అనుభవాలతో ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టీబీ లక్షణాలు, పరీక్షలు, చికిత్స తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తారన్నారు. టీబీ ప్రోగ్రాం అధికారి అనిత, జిల్లా లీడర్ శ్రీనివాస్, పీహెచ్ఎన్ జ్యోతి, సూపర్‌వైజర్ ప్రసాద్, వాసవాచారి, ఏఎన్ఎమ్‌ల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


పోతుగల్ పీహెచ్‌సీలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

కోనరావుపేట: గత పదేళ్లలో జరగని అభివృద్ధి పనులు కాంగ్రెస్ పాలనలో జరుగుతున్నాయని, అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తమ నాయకుడిని చల్మెడ లక్ష్మీ నరసింహారావు విమర్శించడం సరికాదన్నారు. సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసమే బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. మార్కెట్ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొట్టే రుక్మిణి, యూత్ నాయకులు బుర్ర రవీందర్, మార్కెట్ డైరెక్టర్ మాందాల లింబయ్య, అజీమ్ పాషా, ప్రభాకర్ రెడ్డి, నాయకులు తిరుపతి యాదవ్, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఫిరోజ్ పాషా

సంక్షిప్త వార్తలు

• చిన్న బతుకమ్మకు ఏర్పాట్లు



సిరిసిల్ల అర్బన్ : పట్టణ పరిధిలోని రగుడులో చిన్న బతుకమ్మ వేడుక కోసం మాజీ కౌన్సిలర్ పోచవేని సత్య గ్రామ శివారులోని చెరువు వద్ద ఏర్పాట్లు చేశారు. చెరువులో తక్కువ నీరు ఉండడంతో గ్రామానికి చెందిన బైరి పర్శరాములు వ్యవసాయ బోరు నుంచి చెరువులోకి నీళ్లను మళ్లించి బతుకమ్మ కోసం ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

• విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

వీర్నపల్లి: మండలకేంద్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఎంపీడీవో బీరయ్య, మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. దసరా సెలవుల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, కుంటలవద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు పిల్లలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

• ఎస్సైకి ఫిర్యాదు

రుద్రంగి: ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు సమయానికి హాజరుకాకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జాతీయగీతాన్ని అవమానపర్చిన కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సై శ్రీనివాస్‌కు కాంగ్రెస్ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

• ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ముస్తాబాద్: జిల్లా, మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను నామాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాములుగా వొరగంటి పద్మకళ, మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న డి.రాజేశంను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు స్వామి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

• చెరువు కట్టకు మరమ్మతులు

చందుర్తి : మండలంలోని బండపల్లి ఊరచెరువు కట్టపై ఉన్న దారి ఇటీవల వర్షాలకు అధ్వాన్నంగా మారింది. కట్టపై ఉన్న గుంతల్లో నీరు ఉండటంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రాజెక్టు సూపర్‌వైజర్ దేవయ్య ఆధ్వర్యంలో కిలో మీటర్‌కుపైగా రోడ్డుకు లష్కర్లతో మరమ్మతు చేయించారు.

• సన్మానం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి రావాల్సిన అద్దె బకాయి వసూలు చేసినందుకు గాను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

23న హుండీ లెక్కింపు

సిరిసిల్లటౌన్: శ్రీశాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 23న మంగళవారం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకలు



గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి కళాశాల ప్రత్యేకతలు, బోధన విధానాలు గురించి వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, డీఐఈవో శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు



వేములవాడ: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. పలుసార్లు కాలనీవాసులు, ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సైతం మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో ఈ ప్రాంతంలోని వ్యాపారులు గుంతలుపూడ్చి మరమ్మతులు చేశారు. వీటితోపాటు ఈ రోడ్డుపై కేడీసీసీ బ్యాంకు ముందు రెండుచోట్ల, బైపాస్‌రోడ్డుకు వెళ్లే ప్రాంతంలో ఐదుచోట్ల గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

చందుర్తి: మండలకేంద్రంలోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన యువకుడు కారులో పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా వేములవాడ నుంచి చందుర్తి వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని అంబేడ్కర్ బస్టాండ్ ప్రాంతంలో ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో వద్లూరి నగేష్, లక్ష్మీకి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



సిరిసిల్ల: పట్టణంలోని గణేశ్‌నగర్ ఏకలవ్యనగర్‌లో సిమెంట్ రోడ్డు శిథిలమైంది. పెద్ద మురుగు కాల్వ పక్కనే కల్వర్టును దాటేందుకు నిర్మించిన అప్రోచ్ రోడ్డు పూర్తిగా పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రమాదం అంచున వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పరిశీలించి అప్రోచ్ రోడ్డును పునర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : ఖలీల్‌పాషా
మున్సిపల్ కమిషనర్, సెల్‌నెం : 98499 05879

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పేదలకు అండగా ప్రభుత్వం

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 51 మందికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.కోటి 52లక్షల 8వేలు, 23 మందికి కల్యాణలక్ష్మి కింద రూ.23,2,668 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కే భాస్కర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిశాల జ్యోతి, జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు తీగల పుష్పలత, గుడిసె ఐలయ్య, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ప్రసాద్, రజనికాంత్, మామిడి సంజీవ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి


సైకిళ్లతో విద్యార్థులు, తల్లిదండ్రులు


బోయినపల్లి : సైకిళ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ అన్నారు. మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఎంపీడీవో లచ్చాలు, ఏఏపీ చైర్‌పర్సన్ అనిత, హెచ్ఎం మనోహర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, మీస సంజీవ్, కరెడ్ల మల్లారెడ్డి, సత్యంరెడ్డి, శంకర్, జిల్లెల్ల మల్లేశ్, ప్రశాంత్, శ్రీనివాస్‌రావు, నరేశ్, ప్రశాంత్‌రెడ్డి, రవి, రాజు, బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని స్థంబంపల్లి, బోయినపల్లి, కొదురుపాక, మల్లాపూర్, విలాసాగర్ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు శనివారం 97 సైకిళ్లు పంపిణీ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఎడపల్లి పరశురాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే బాలబాలికలకు రవాణా ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రధాని మోదీ కానుకగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రవణ్‌కుమార్, నాయకులు గుడి రవీందర్‌రెడ్డి, ఉదారి నరసింహచారి, కొనుకటి హరీశ్, బొంగాని అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

మహిళల భద్రతకే షీటీం

చందుర్తి: మహిళల రక్షణ, భద్రతే షీటీం లక్ష్యమని షీటీం ఇన్‌చార్జి ఆర్ఎస్సై ప్రమీల అన్నారు. మండలంలోని జోగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. లోన్ యాప్‌లు, ఫేక్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా మోసపోతే 1930 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రాజు, ఉపాధ్యాయులు మహేశ్, జావీద్, గోవర్ధన్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న షీటీం ఇన్‌చార్జి

బీజేపీ నాయకుల శ్రమదానం



తంగళ్లపల్లి: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పశువైద్య కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. పశు వైద్యశాల చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించి శుభ్రం చేశారు. జిల్లా మీడియా కన్వీనర్ కాసుగంటి రాజు రావు, మండల ప్రధాన కార్యదర్శి ఇటుకల రాజు, కోసిని వినయ్ యాదవ్, ఉపాధ్యక్షుడు ఆశీర్వాద్, తదితరులు పాల్గొన్నారు.

టేకు దుంగలు పట్టివేత

చందుర్తి: మండల కేంద్రం శివారులోని మోత్కురావుపేట అటవీ ప్రాంతం నుంచి బైక్‌పై తరలిస్తున్న టేకు దుంగలను చందుర్తి పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు. చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు దేవరాజు రెండు టేకు దుంగలను బైక్‌పై తరలిస్తుండగా స్థానిక బస్టాండ్ ప్రాంతంలో పట్టుకున్నారు. టేకు దుంగలతోపాటు ద్విచక్ర వాహనాన్ని అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు.

అంత్యక్రియలకు బురదపాట్లు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం వాసులకు అంత్యక్రియల నిర్వహణలో కూడా బురదపాట్లు తప్పడం లేదు. పట్టణంలో రెండు వైకుంఠధామాలు నిర్మించారు. కొన్నేళ్లుగా వీటి నిర్వహణపై బల్దియా పట్టించుకోవడం లేదు. అంత్యక్రియలకు అక్కడ మౌలిక వసతుల లేమితో ఇక్కట్లు తప్పడం లేదు. శనివారం ఓ వ్యక్తి మృతిచెందగా నెహ్రూనగర్‌లోని వైకుంఠధామం ఇలా బురద ఉండటంతో వారు ఇబ్బంది పడ్డారు. అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

